నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 18 అక్టోబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



- ఘనంగా నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- సంస్కృతీ సంప్రదాయాల నడుమ వారసుల పూజలు
- వేలాదిగా తరలివచ్చిన అడవిబిడ్డలు, జనసంద్రమైన పోరుగడ్డ
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు.. ఆకట్టుకున్న స్టాళ్లు
- హట్టి నుంచి ఉచిత బస్సు సౌకర్యం
- పోలీసుల భారీ బందోబస్తు

# వీరుడికి వందనం

## జోడేఘాట్‌లో అధికారికంగా కుమ్రం భీం, సూరు వర్ధంతి



భీంకు నివాళులర్పిస్తున్న ఆయన మనువడు సోనేరావ్, చిత్రంలో మంత్రి సీతక్క, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

వేదికపై మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు, అధికారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/కెరమెరి, అక్టోబర్ 17 : జల్.. జంగిల్.. జమీన్ కోసం పోరాడిన ఆదివాసీ ముద్దుబిడ్డ, గిరిరత్న కుమ్రంభీంను యావత్ ప్రజానీకం స్మరించుకున్నది. గురువారం జోడేఘాట్‌లో భీం, కుమ్రం సూరు వర్ధంతిని అధికారికంగా నిర్వహించగా, తెలంగాణ నుంచేగాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన అడవిబిడ్డలతో పోరుగడ్డ పులకించింది. డప్పు చప్పుళ్లు, సన్నాయి, కాలికోం వాయిద్యాలు.. ఆటా పాటలతో ఆ ప్రాంతం మారుమోగింది. భీం మనువడు కుమ్రం సోనేరావ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, మంత్రి సీతక్క(ధనసరి అనుసుయ), ఆసిఫాబాద్, ఖానాపూర్, సిర్పూర్, మంచిర్యాల ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, వెడ్మా బొజ్జు, పాల్వాయి హరీశ్‌బాబు, కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్సీ దండే విఠల్, కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, ఎస్పీ డీ.వీ.శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, మాజీ మంత్రి వేణుగోపాలాచారి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో పాటు ఆదివాసీ సంఘాల నాయకులు హాజరై సామూహిక పూజలు చేశారు. అమరవీరుల జెండాలను ఎగురవేశారు. అనంతరం భీం విగ్రహం, సమాధి వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుమ్రం సూరు మనువడు కుమ్రం పాండు ఆధ్వర్యంలో ఆయన వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కొలాం ఆదివాసీలు సంప్రదాయబద్ధంగా నివాళులర్పించారు. అనంతరం సంప్రదాయ వాయిద్యాలపై ఆదివాసీలు నృత్యాలు చేస్తూ సంబురాలు జరుపుకున్నారు. వర్ధంతి సందర్భంగా హట్టి నుంచి జోడేఘాట్ వరకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. సభకు వచ్చిన మహిళలు, పురుషులు, వీఐపీలు, పోలీసులు, మీడియాకు వేర్వేరుగా తాగునీరు, భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పెందోర్ రాజేశ్వర్, కన్వీనర్ మోతీరాంతో పాటు ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

### ఆలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

భీం 84వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన దర్బార్‌లో ఆదివాసీ కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గోండి, తెలుగు భాషలో కళాకారులు పాడిన పాటలు, గుస్సాడీ, డెంస్సా నృత్యాలు కనువిందు చేశాయి. గోండ్, ప్రధాన్, కొలాం, తోటి, నాయక్‌పోడ్, మొత్తం 9 తెగల ఆదివాసీలు తమ ఆచార వ్యవహారాలు, సంస్కృతిని ప్రదర్శించారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు వైద్య శిబిరంతో పాటు మొబైల్ హాస్పిటల్ ఏర్పాటు చేశారు. ఫిర్యాదుల విభాగంలో అర్జీలను స్వీకరించారు.

### పోలీసుల భారీ బందోబస్తు..

భీం వర్ధంతి సభ సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ శ్రీనివాస రావు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. హట్టి నుంచి జోడేఘాట్ వరకు రహదారి పొడువునా తనిఖీలు చేపట్టారు. పహారాకాశారు.

### ఐటీడీఏ బలోపేతానికి కృషి : మంత్రి సీతక్క

ఐటీడీఏకు పూర్వ వైభవం తీసుకొచ్చి బలోపేతం చేస్తామని పంచాయతీ రాజ్, రూరల్ డెవల్‌మెంట్ మంత్రి సీతక్క పేర్కొన్నారు. కుమ్రం భీం వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన దర్బారులో ఆమె మాట్లాడారు. జిల్లాలో 1.60 లక్షల ఎకరాలకు అటవీ హక్కుల చట్టం ద్వారా పట్టాలు ఇవ్వడం జరిగిందని, మిగతా గిరిజన రైతులకు కూడా త్వరలో అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ అధికారుల అత్యుత్సాంతో ఆదివాసీలు ఇబ్బందులు పడుతున్నారని, వారు తీరు మార్చుకోవాలని సూచించారు. జోడేఘాట్‌ను పర్యాటకంగా తీర్చిదిదేందుకు రూ. 6 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అడ ప్రాజెక్టు కోసం రూ. 2.75 కోట్లు ఇవ్వనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ 2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ఈ ప్రాంతానికి వచ్చారని, జోడేఘాట్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. గిరి వికాసం పథకాన్ని అమలు చేయాలని కోరారు. మంగి, గుండాలవంటి మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్లు మంజూరైనప్పటికీ పనులు సాగడం లేదన్నారు. వట్టివాగు, అడ ప్రాజెక్టులకు మరమ్మతులు చేపట్టి సాగు నీరందించాలని కోరారు. ఆసిఫాబాద్ నియోజకవర్గానికి ప్రత్యేకంగా 10 వేల ఇండ్లు మంజూరు చేయాలన్నారు. జైనూర్ ఘటనలో ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడిన ఆదివాసీ మహిళకు రూ. 10 లక్షల సాయమందించాలని, ఆమె కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆమె కోరారు. ఎంపీ గోడం నగేశ్ మాట్లాడుతూ 2014లో కేసీఆర్ జోడేఘాట్ వచ్చిన తర్వాత ఎంతో అభివృద్ధి చెందిందని, ప్రత్యేకంగా కేసీఆర్ నిధులు కేటాయించడంతో రోడ్డు, మ్యూజియం, స్మారక చిహ్నం, డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఆదివాసీలకు మంజూరయ్యాయని తెలిపారు. కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే మాట్లాడుతూ ఆదివాసీలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ 2008లో నిర్వహించినట్లు ఐటీడీఏ ప్రత్యేక డీఎస్సీని నిర్వహించాన్నారు. భీం మనువడు కుమ్రం సోనేరావ్ మాట్లాడుతూ అటవీ శాఖ అనుమతులు లేక నిలిచిపోయిన టోకెన్ మోవడ్ నుంచి హట్టి వరకు బీటీ రోడ్డు నిర్మించేలా చర్యలు చేపట్టాలన్నారు. జోడేఘాట్ దర్బార్‌లో ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా గోండి భాషలో చేసిన ప్రసంగం ప్రజలను ఆకట్టుకుంది. ఆదివాసీ హక్కుల కోసం కుమ్రం భీం చేసిన పోరాటం గొప్పదని, ఆయన ఆశయ సాధనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

దర్బార్‌లో సంప్రదాయ నృత్యాలు

భీం మనువడు సోనేరావ్‌కు దుస్తులు బహూకరిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

సభకు హాజరైన ప్రజ

# సరిహద్దులో పోలీసు నిఘా

- మహారాష్ట్రలో మోగిన ఎన్నికల నగారా
- బార్డర్‌లో తనిఖీలు
- ఎదుల్లబంధం వద్ద రూ.3 లక్షల విలువైన మద్యం స్వాధీనం

కోటపల్లి మండలంలో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లో తనిఖీ చేస్తున్న కోటపల్లి ఎస్ఐ రాజేందర్

కోటపల్లి, అక్టోబర్ 17 : మహారాష్ట్రలో శాసనసభ ఎన్నికలకు నగారా మోగడంతో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. నవంబర్ 20న ఎన్నికలుండగా, కోడ్ అమల్లోకి వచ్చింది. తెలంగాణ నుంచి మద్యం, డబ్బు తరలివెళ్లకుండా ఇరు రాష్ట్రాల పోలీసులు చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. మహారాష్ట్రకు సరిహద్దుగా ఉన్న కోటపల్లి మండలం రాపనపల్లి సమీపంలో అంతర్రాష్ట్ర వంతెన వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద నిరంతరం తనిఖీలు చేపడుతున్నారు. సిరోంచతో పాటు కాళేశ్వరానికి వెళ్లే ప్రయాణికుల వద్ద రూ. 50 వేలకు పైగా ఉంటే పోలీస్‌లు సీజ్ చేయనున్నారు.

### రూ.3 లక్షల విలువైన మద్యం పట్టివేత

పారుపల్లి వైన్ షాప్ నుంచి ఆటో, బొలెరో వాహనాల్లో తరలుతున్న రూ.3,01,542 విలువ చేసే మద్యాన్ని కోటపల్లి ఎస్ఐ రాజేందర్ గురువారం పట్టుకున్నారు. ఎదుల్లబంధం గ్రామ సమీపంలో మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఇద్దరు డ్రైవర్లపై నమోదు చేశామని, స్వాధీనం చేసుకున్న మద్యం, వాహనాలను కోటపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ రాజేందర్ తెలిపారు.

# ఎన్ఎల్ఎం బృందం పర్యటన

### క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనుల పరిశీలన

హాజీపూర్, అక్టోబర్ 17 : మండలంలోని బుద్ధిపెల్లి, పెద్దంపేట గ్రామాల్లో ఎన్ఎల్ఎం (నేషనల్ లెవల్ మానిటర్స్) బృందం గురువారం సందర్శించింది. అధికారులు బాలమురళి, ఏకే సునీల్ జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులతో కలిసి కేంద్రం నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు, పథకాల అమలు తీరు గురించి క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల ఆవరణలో మహిళా స్వయం సహాయక సంఘాలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రుణాలను ఏ విధంగా సద్వినియోగం చేసుకున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈజీఎస్ కూలీల సమస్యల గురించి ఆరా తీశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. పంచాయతీ నిధులతో చేపట్టిన పనులు, ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో కిషన్, నోడల్ అధికారి సదానంద్, ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో ఉమర్‌శరీఫ్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఈసీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు రూప, రఘుల, ఐకేపీ ఏపీఎం రాజన్న ఈజీఎస్ టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దంపేటలో ఈజీఎస్ పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

# నేడు బాల్క సుమన్ జన్మదిన వేడుకలు

చెన్నూర్, అక్టోబర్ 17 : బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ జన్మదిన వేడుకలను శుక్రవారం చెన్నూర్‌లో నిర్వహించనున్నట్లు మున్సిపాల్ చైర్‌పర్సన్ అర్చనా గిల్డా, వైస్ చైర్మన్ నవాజుద్దీన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక శివాయర్స్, టీఆర్ఎస్వీ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. లయంలో అర్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, అనంతరం సత్యసాయి వృద్ధాశ్రమంలో అన్నదానం, ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఐబీ దర్గా దగ్గర కేక్ కటింగ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారి

# గూడెంలో ఘనంగా పౌర్ణమి జాతర

గూడెంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

దండేపల్లి, అక్టోబర్17: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో గురువారం ఆశ్వీయుజ పౌర్ణమి జాతర ఘనంగా జరిగింది. జిల్లా నుంచేగాక వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వందలాదిగా తరలివచ్చారు. సమీప గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం గుట్టపై గల సత్యనారాయణ స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు కుంకుమ పూజలు చేశారు. 131మంది సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నోముకున్నారు. ఆపై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ప్రధాన అర్చకులు, అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

# రేషన్ షాపుల్లో బినామీల దందా

- ఏఎస్‌వోనే బురిడీ కొట్టించిన ఘనులు

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 17: రేషన్ షాపుల్లో బినామీల దందా కొనసాగుతూనే ఉంది. బినామీలను ఏరిపారేయాలని ప్రభుత్వం భావించినప్పటికీ అది ఆచరణలో మాత్రం సాధ్యపడడం లేదు. ఐదునెలల క్రితం రెవెన్యూ అధికారులు బినామీల విషయంలో విచారణ జరిపి ఎవరూ లేరని నిర్ధారణకు వచ్చారు. రెండు రోజుల క్రితం రేషన్ షాపు తనిఖీకోసం వచ్చిన ఏఎస్‌వోను బినామీ వ్యక్తులు బురిడీ కొట్టించినట్లు తెలిసింది. అసలు యజమాని స్థానంలో మరో వ్యక్తిని చూపించి ఆమెనే యజమాని అని ఏఎస్‌వోకు చెప్పారు. వాస్తవానికి సంబంధిత షాపు యజమాని వేరే ప్రాంతంలో నివసిస్తున్నారు. ఆమె భర్త ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారు. కానీ యజమాని ఉండాల్సిన స్థానంలో మరో వ్యక్తిని చూపించినట్లు జోరుగా ప్రచారం జరుగుతున్నది. ఈ విషయమై ఏఎస్‌వోను వివరణ కోరగా.. అదేమీ లేదని, సంబంధిత షాపు యజమాని, ఆమె ఆధార్ కార్డును పరిశీలించానని చెప్పారు. అయితే మరోసారి నిర్ధారణ చేసుకోవాలని చెప్పగా అందుకు ఆయన సరేనన్నారు.

# మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

- కలెక్టర్ కుమార్‌దీపక్, అదనపు కలెక్టర్ దాసరి వేణు
- ఘనంగా వాల్మీకి జయంతి

నస్పూర్/ఆసిఫాబాద్ టౌన్, అక్టోబరు 17 : : మహనీయుల జీవిత చరిత్రలను ఆదర్శంగా తీసుకోవాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకి జయంతిలో అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన వాల్మీకి జయంతిలో జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్‌తో కలిసి పాల్గొన్నారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయాచోట్ల జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం బాలేశ్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మారుతి పటేల్, మాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగోశేశంకర్, బోయ వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు పర్రె యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి మోరేశ్వర్, కవల్కర్ నారాయణ, మేంగ్రి అనంతరావు,చాపుడే సురేశ్ పాల్గొన్నారు.

మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు, బీసీ సంఘం నాయకులు

# మెరుగైన వైద్యమందించాలి

సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

దండేపల్లి, (జన్నారం), అక్టోబర్17 : రోగులకు మెరుగైన వైద్యమందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి హరీశ్‌రాజ్ అన్నారు. జన్నారం పీహెచ్‌సీని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవల గురించి ఆరా తీశారు. అనంతరం రిజిష్టర్లు తనిఖీ చేశారు. వైద్యాధికారి ఉమశ్రీ, సిబ్బంది ఉన్నారు.

దండేపల్లి, అక్టోబర్17 : గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్య సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేయవద్దని డీఎంహెచ్‌వో హెచ్చరించారు. తాళ్లపేట పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి క్రాంతికిరణ్ ఉన్నారు.